క్లుప్తంగా

'స్పందన'లో మూడు అర్జీలు



గంపలగూడెం: గంపలగూడెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో మూడు అర్జీలు వచ్చినట్లు ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. తహసీల్దార్ జి. బాలకృష్ణారెడ్డి, ఎంఈఓ సోమశేఖర్‌నాయక్, విద్యుత్‌శాఖ సబ్ ఇంజినీర్ కొమ్ము వాసు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మునిలక్ష్మి, ఏపీఎం నాగరాజు, హౌసింగ్ ఏఈ కిషోర్, ఆర్‌డబ్ల్యూఎస్ వర్క్ ఇన్‌స్పెక్టర్ చిన్నబ్బాయి పాల్గొన్నారు.

'స్పందన'ను సద్వినియోగం చేసుకోవాలి

ఆగిరిపల్లి: ప్రజాసమస్యల పరిష్కారానికై నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎం.ఉదయభాస్కరరావు, ఎంపీడీఓ కె. వాణి పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం మండల స్థాయి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు అర్జీలు రాగా, వాటిని సంబంధిత అధికారుల ద్వారా పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు.

విద్యుత్ చౌర్యం నేరం

జి.కొండూరు: విద్యుత్ చౌర్యం చేసిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని విజయవాడ రూరల్ ఈఈ జీవీ శ్రీనివాసరావు అన్నారు. జి.కొండూరు మండల పరిధిలో విద్యుత్‌శాఖ అధికారులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెలగలేరు గ్రామంలో విద్యుత్ చౌర్యానికి పాల్పడిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. అదేవిధంగా ఓవర్‌లోడు కారణంగా 232 కేసులు నమోదు చేయగా రూ.5.4 లక్షల అపరాధ రుసుంను విధించినట్లు వివరించారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి విద్యుత్ చౌర్యాన్ని అరికట్టడంతో పాటు 24/7 నిరంతరాయ విద్యుత్ సరఫరా చేసేలా కృషి చేయాలని సూచించారు.

నేడు ఉపాధ్యాయుల సమావేశం

పెనుగొలను(గంపలగూడెం): పెనుగొలను జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉదయం 9.30 గంటలకు మండల స్థాయి ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించనున్నట్లు ఎంఈఓ సోమశేఖర్ నాయక్ తెలిపారు. జిల్లా పరిషత్, మండల పరిషత్, ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీ, జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, ఎంటీఎస్ ఉపాధ్యాయులు, సమగ్ర శిక్ష ఉద్యోగులు అందరూ సమావేశానికి హాజరు కావాలని పేర్కొన్నారు. 'మేము చదవటం ఇష్టపడతాం, జగనన్న విద్యా కానుక-4, నాడు-నేడు ఫేజ్-2, పాఠశాల సంసిద్ధత కార్యక్రమం, గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిబిరాలు, బడిబాట, విద్యార్థుల అడ్మిషన్ నమోదు కార్యక్రమం, ఐఎఫ్‌పీ టాబ్లెట్స్ పంపిణీ తదితర అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. మండల స్థాయి వివిధశాఖల అధికారులు పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొనే సమావేశానికి అందరూ తగిన సమాచారంతో తప్పక హాజరు కావాలని పేర్కొన్నారు.

సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద పేదల ధర్నా

నూజివీడు: అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ముసునూరు మండలం సూరేపల్లిలో పేదలకు ఇచ్చిన అసైన్డ్ పట్టా భూమి సర్వే చేసి లబ్ధిదారులకు అప్పగించాలని కోరుతూ నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం పేదలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లారావు మాట్లాడుతూ ముసునూరు మండలం సూరేపల్లిలో 1993లో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ పేదలకు ఇచ్చిన అసైన్డ్ డి.ఫారం పట్టా భూములను స్వాధీనం చేసుకుని కోనేరు రంగారావు కమిటీ సిఫార్సుల ప్రకారం అసైన్డ్ పట్టాదారులకు అప్పగించాలని కోరారు. మల్లంగి తిరుపతిరావు, కవలరత్నం, నాగేంద్రమ్మ, దాసు, నాగభూషణం పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం తూట్లు

నూజివీడు: ఉపాధి హామీ పథకం రక్షణ యాత్ర ఐదో రోజు నూజివీడు మండలం మొర్సపూడి, గొల్లపల్లి, మీర్జాపురం, ఎంఎన్‌పాలెం, పల్లెర్లమూడిల్లో సోమవారం పర్యటించింది. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ నరసింహ ఉపాధి హామీ కూలీలను కలిసి పరిస్థితులను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చేందుకు కేంద్ర ప్రభుత్వం 2023-24 బడ్జెట్ కేటాయింపుల్లో భారీ కోత విధించిందని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం పేదల కోసం కాకుండా ధనికులు, కార్పొరేట్ల ప్రయోజనాల కోసం పనిచేస్తోందని విమర్శించారు. ఉపాధి హామీ పథకంలో పని దినాల సంఖ్యను 200 రోజులకు పెంచడంతో పాటు రోజు కూలి రూ.600కు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పి.మురళీ, ఎస్.మహంకాళీ, జిల్లా కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, రాజశేఖర్, దాసు పాల్గొన్నారు.

ఉత్తమ పఠనానికి గ్రంథాలయాలే కీలకం

గోపవరం (ముసునూరు): ఉత్తమ పుస్తక పఠనానికి గ్రంథాలు, గ్రంథాలయాలే కీలకమని గోపవరం వ్యవసాయ సొసైటీ అధ్యక్షుడు కోటగిరి గోపాలకృష్ణ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో బ్రాంచి అధికారి సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక విద్యావేత్త, గ్రామ సర్పంచ్ కంచర్ల వాణి అధ్యక్షతన వేసవి శిక్షణ శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు.

గొల్లపల్లిలో..

గొల్లపల్లి గ్రంథాలయంలో సోమవారం వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న గొల్లపల్లి హైస్కూల్ భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు ఎ.నాగిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజూ క్రమం తప్పకుండా శిబిరానికి రావాలన్నారు. కార్యక్రమంలో పీడీ రవీంద్ర, గ్రంథాలయాధికారి డొక్కు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చాట్రాయిలో..

చాట్రాయి: మండలంలోని చనుబండ, చాట్రాయి గ్రంథాలయాల ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో చనుబండ వైఎస్సార్ సీపీ నాయకులు మోరంపూడి నాగేశ్వరావు, శివకుమార్, వనమా వాసు, సచివాలయ సిబ్బంది, చాట్రాయిలో జెడ్పీ హైస్కూలు హెచ్ఎం సత్యనారాయణ రెడ్డి గ్రంథాలయ అధికారుల శ్రీకాంత్, మణికంఠ పాల్గొన్నారు.

తిరువూరులో..

తిరువూరు: విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి సూచించారు. సోమవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించారు. పుస్తక పఠనం, ఇంగ్లిష్ గ్రామర్, స్పోకెన్ ఇంగ్లిష్ నేర్చుకుని విజ్ఞానం పెంపొందించుకోవాలని ఆమె అన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు, గ్రంథాలయాధికారి పద్మావతి, తెలుగు భాషా వికాస సమితి అధ్యక్షుడు తోట ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



కొండపల్లిలో వేసవి శిక్షణ శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరించిన జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు కామేశ్వరరావు



విస్సన్నపేటలో వేసవి విజ్ఞాన శిబిరం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు



తిరువూరులో ప్రారంభమైన వేసవి శిక్షణ తరగతులు

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని జన విజ్ఞాన వేదిక ఉపాధ్యక్షుడు పి.కామేశ్వరరావు అన్నారు. కొండపల్లి శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం మాజీ సర్పంచి వెనిగళ్ల అమ్మాజీతో కలసి సోమవారం ప్రారంభించి కరపత్రాలు ఆవిష్కరించారు. వేసవి శిక్షణ సదస్సులు విద్యార్థుల్లో ఆనందంతో పాటు విజ్ఞానం పెంపొందించేందుకో ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. మూఢనమ్మకాలు విడనాడి శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలన్నారు. శిబిరంలో చిత్రలేఖనం, పేపర్ క్రాఫ్ట్ వంటి సృజనాత్మక అంశాలపై పట్టు సాధించాలన్నారు. గ్రంథాలయాధికారి చంద్రశేఖర్, అచ్యుతరావు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభం

నూజివీడు: విద్యార్థులు వేసవి సెలవులను వృథాగా గడపకుండా పుస్తక పఠనం, నీతి కథల ద్వారా నైతిక విలువలు నేర్పడం వంటి వాటిని పెంపొందించడానికే గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో సోమవారం సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చందక రాజారామ్మోహన్‌రావు, కార్యదర్శి ఈమని శేషయ్య, ఉపాధ్యక్షులు వంగల గోవిందరావు పాల్గొన్నారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు, పాఠకులు వినియోగించుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం పోస్టర్లను సోమవారం జెడ్పీటీసీ సభ్యుడు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, వైస్‌ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ సత్యనారాయణ రెడ్డి, కేడీసీసీబీ డైరెక్టర్ రాణి, గృహసారథుల మండల కన్వీనర్ అనుమోలు శివబాజీ, మాజీ వైస్ ఎంపీపీ ఓలేటి దుర్గారావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, గ్రంథాలయాధికారి బాను పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన కేంద్రాన్ని వినియోగించుకోవాలి

పెనుగొలను(గంపలగూడెం): గ్రంథాలయాలలో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన కేంద్రాలను ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు సద్వినియోగపర్చుకుని తమజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎంఈఓ బి.సోమశేఖర్‌నాయక్ తెలిపారు. గంపలగూడెం మండలం పెనుగొలను శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్లను ఆయన విడుదల చేశారు. జూలై 11వ తేదీ వరకు కొనసాగే వేసవి విజ్ఞాన కేంద్రాల్లో అందుబాటులో ఉంచే పుస్తకాలు, పత్రికలు గ్రంథాలను చదివి విద్యార్థులు తమ పఠనాసక్తిని పెంచుకోవాలన్నారు. గ్రంథాలయ నిర్వహణాధికారి జ్యోతిర్మయి పాల్గొన్నారు.

క్షతగాత్రుడికి ఆర్థిక సాయం

ఆగిరిపల్లి: మండలంలోని ఎస్‌ఆర్‌ఐ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ వద్ద పనిచేసే ఆగిరిపల్లికి చెందిన కాట్రు ధనశ్రీనివాసరావు గత నెలలో లారీ ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడ్డాడు. దీనిపై స్పందించిన కళాశాల చైర్మన్ ఆర్.వెంకట్రావు గత నెల జీతంతో పాటు, ఆర్థిక సాయం కింద రూ.10 వేలు అందజేసినట్లు శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ప్రమాదంలో గాయపడిన సమయంలో ఏలూరు ఆంధ్ర ఆస్పత్రి యాజమాన్యంతో చైర్మన్ మాట్లాడి త్వరితగతిన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు.

కుమారుడు అదృశ్యంపై తల్లి ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తన కుమారుడు కనిపించడం లేదంటూ తల్లి కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా సోమవారం కేసు నమోదు చేశారు. కృష్ణవేణి క్లాత్ మార్కెట్ సమీపంలోని జెండాచెట్టు వద్ద షేక్. జైన్‌బీ తన మూడో కుమారుడైన సత్తార్‌తో కలిసి ఉంటుంది. సత్తార్‌కు మొదటి భార్యతో విభేదాల కారణంగా విడాకులు తీసుకున్నారు. రెండేళ్ల కిందట మరో మహిళతో వివాహమైంది. కొంత కాలంగా జైన్‌బీ విషయంలో భార్యాభర్తలిద్దరికీ గొడవలు జరుగుతున్నాయి. తల్లిని వదిలేసి తనతో కాపురానికి రావాలని మదీనా అలిగి పుట్టింటికి వెళ్లిపోయింది. సోమవారం తెల్లవారుజామున నిద్రలేచే సరికి ఇంట్లో సత్తార్ కనిపించకపోవడంతో ఆందోళన చెందిన తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లు ముమ్మరం చేయండి

ఇబ్రహీంపట్నం: రబీ సాగులో ధాన్య కొనుగోళ్లు ముమ్మరం చేయాలని విజయవాడ డివిజనల్ సహకార విభాగ అధికారి కిరణ్‌కుమార్ అన్నారు. ఇబ్రహీంపట్నం, మూలపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో ధాన్యం కొనుగోళ్లు సోమవారం ఆయన పరిశీలించారు. ఇప్పటికీ ఇబ్రహీంపట్నంలో 35 క్వింటాళ్లు కొనుగోళ్లు చేశామని, మరో 280 క్వింటాళ్ల ధాన్యం షెడ్యూల్ మేరకు మంగళవారం సేకరించనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ మునగాల సాంబశివారెడ్డి తెలిపారు. గుంటుపల్లిలో 600 క్వింటాళ్ల ధాన్యం రైతుల నుంచి సేకరించామని మండల వ్యవసాయ అధికారి శైలజ తెలిపారు. జూపూడిలో ఆరబెట్టిన ధాన్యం రాసులు పరిశీలించారు. మండలంలో తడిసిన ధాన్యం లేదని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు అయిన మేరకు రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. పీఏసీఎస్ చైర్మన్లు శివారెడ్డి, గాంధీ, ట్రెయినీ డిప్యూటీ రిజిస్ట్రార్ త్రినాథ్, పీఏసీఎస్ కార్యదర్శులు మాధవరావు, రవికుమార్ పాల్గొన్నారు.



జూపూడిలో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న విభాగ సహకార అధికారి కిరణ్‌కుమార్

డ్వాక్రా మహిళలకు గొర్రెపొట్టేలు పిల్లల పంపిణీ

తెల్లదేవరపల్లి (విస్సన్నపేట): డ్వాక్రా మహిళలకు గొర్రెపొట్టేలు పిల్లలు యూనిట్‌లు మంజూరు కావడంతో సంబంధిత లబ్ధిదారులకు గొర్రె పొట్టేలు పిల్లలను సోమవారం పంపిణీ చేశారు. మండలంలోని తెల్లదేవరపల్లిలో ఏడుగురు లబ్ధిదారులకు ఒక్కొక్క యూనిట్‌కు రూ.50 వేలు విలువ చేసే 87 కేజీల పొట్టేలు పిల్లలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సమాఖ్య ప్రెసిడెంట్ కె.సీత, జిల్లా హెచ్‌డీ యాంకర్ పర్సన్ విక్టర్‌ప్రకాష్, ఎంపీటీసీ చాట్ల మణి, సొసైటీ అధ్యక్షుడు నాగాచారి, ఏపీఎం జమలయ్య పాల్గొన్నారు.



పొట్టేలు పిల్లలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

కుటుంబ ఆరోగ్య సర్వే

వెల్వడం(మైలవరం): మైలవరం మండలం వెల్వడం గ్రామంలో సిగ్మా రీచర్స్ కన్సల్టెన్సీ ఏజెన్సీ ఆధ్వర్యంలో సోమవారం జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే నిర్వహించారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాపులేషన్ సర్వే సంస్థ బృందం సర్వే నిర్వహించింది. ఈ సందర్భంగా ఎస్.దేముడు, శ్రీనివాస్, అజయ్ మాట్లాడుతూ నిర్దేశించిన కుటుంబాలను సర్వే చేసి ఆరోగ్య విజయాలను నమోదు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ముగ్గురు సభ్యుల బృందంతో సర్వే చేపట్టినట్లు పేర్కొన్నారు. వివరాలను ఐఐపీఎస్‌కు నివేదిస్తామన్నారు. కార్యక్రమలో గ్రామ సర్పంచ్ పీ ధర్మరాజు, వైస్ ఎంపీపీ రత్నబాబు పాల్గొన్నారు.



కుటుంబ ఆరోగ్య సర్వేలో పాల్గొన్న బృందం సభ్యులు

పేదలకు దుస్తుల పంపిణీ

నూజివీడు: ట్రిపుల్ ఐటీలోని హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ పలు సేవా కార్యక్రమాలతో ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా ట్రిపుల్ ఐటీలోని ఫ్యాకల్టీ, విద్యార్థుల నుంచి సేకరించిన దుస్తులను పట్టణంలోని యానాది కాలనీలో వస్త్రదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి ఇక్కడ నివసిస్తున్న 160 కుటుంబాలకు సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో అందజేశారు. ఈ కార్యక్రమాన్ని అలెగ్జాండర్ ప్రీతమ్ జాకబ్ స్థాపించిన డెస్టినీ చేంజ్స్ సంస్థ సహకారంతో నిర్వహించారు. దాదాపు రెండు వేల జతల దుస్తులను పేదలకు అందజేసింది. క్యాంపస్‌లోని అధ్యాపకుల పిల్లల కోసం కాలిగ్రఫీ వర్క్‌షాపులను సైతం హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వహించింది. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ విద్యార్థి సభ్యురాలు సువర్ణ బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, డ్రాపౌట్స్ తదితర అంశాలపై కాలనీవాసులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యక్షురాలు పద్మావతి, హెచ్ఎం పార్థసారథి, ఆంగ్ల ఉపాధ్యాయుడు జోసెఫ్, హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు సలీంబాబు, డీన్ వెల్ఫేర్ బాలురు వెంకట్రావు, డీన్ వెల్ఫేర్ బాలికలు స్రవంతి, లక్ష్మణరావు, సీతాపతి, రాజేష్, మధు పాల్గొన్నారు.



పేదలకు వస్త్రాలను అందజేస్తున్న హెల్పింగ్‌హ్యాండ్స్ ప్రతినిధులు

మధురంగా అన్నమయ్య సంకీర్తనా గానం

విజయవాడ కల్చరల్: వేంకటేశ్వరా అన్నమాచార్య సంకీర్తనా ఆకాడమీ, వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పదకవితా పితామహుడు తాళ్ళపాక అన్నమాచార్య జయంతి సందర్భంగా లబ్బీపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహించిన అన్నమయ్య సంకీర్తనా గానం మధురంగా సాగింది. సోమవారం నాటి కార్యక్రమంలో ములుకుట్ల యశశ్విని, ఎన్. భవ్యశ్రీ గీతిక, ఎస్‌జీఎస్ కీర్తన, ఐశ్వర్య, కె.తుషార పూర్ణవల్లి, సంగీత కళాశాల అధ్యాపకురాలు కందుల లక్ష్మీనరసమ్మ సంకీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో ప్రసాద్, సత్యబాలు, శ్రీలలిత తదితరులు పాల్గొన్నారు.



అన్నమయ్య సంకీర్తనలు గానం చేస్తున్న తుషార పూర్ణవల్లి

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

నూజివీడు: పట్టణంలోని 32వ వార్డులో మంగళవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము తెలిపారు. ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు పాల్గొని వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని ఆయా కుటుంబాల వారికి వివరిస్తారని పేర్కొన్నారు.

అసభ్యకరంగా ప్రవర్తిస్తే ఫిర్యాదు చేయండి

నూజివీడు: నూజివీడు సర్కిల్ పరిధిలో ఎక్కడైనా హిజ్రాలు శుభకార్యాల వద్దకు వచ్చి అసభ్యకరంగా ప్రవర్తిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని నూజివీడు రూరల్ సీఐ ఆర్.అంకబాబు సోమవారం తెలిపారు. ఇటీవల నూజివీడు ప్రాంతంలో హిజ్రాల ఆగడాలు ఎక్కువయ్యాయి. పెళ్లిళ్ల, గృహప్రవేశాలు తదితర కార్యక్రమాల వద్దకు హిజ్రాలు వచ్చి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. పట్టణంలోని ఒక వివాహ వేదిక వద్ద హిజ్రాలు డబ్బులు డిమాండ్ చేస్తూ.. అడిగినంత ఇవ్వకపోయేసరికి బంధువర్గాల ముందు అసభ్యకరంగా ప్రవర్తించడంతో వధువు తరపున వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో హిజ్రాలను పిలిపించి రూరల్ సీఐ కౌన్సెలింగ్ ఇచ్చారు.

కళాశాలలు ప్రారంభించాలి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): రాష్ట్ర ప్రభుత్వం మండలానికి రెండు జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయడం అభినందనీయమని, అయితే ఈ విద్యాసంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని డీసీసీ కార్యదర్శి బొర్రా కిరణ్ కోరారు. ఈ మేరకు 'స్పందన'లో కలెక్టర్ ఢిల్లీరావుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. మండలంలోని మూలపాడు జెడ్పీ పాఠశాల, కొండపల్లి జెడ్పీ బాలికల పాఠశాలల్లో జూనియర్ కళాశాలల ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు.

తడిసిన పంట నివారణ చర్యలు

ఇబ్రహీంపట్నం: అకాల వర్షాలతో తడిసిన పంటలు కాపాడుకునేందుకు నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ శాఖ అధికారి శైలజ ఒక ప్రకటనలో సోమవారం సూచించారు. వరిపంట పొలంలో ఉన్నట్లయితే పొలంలో నీరు తీసేసి శిలీంద్రనాలు పిచకారీ చేయాలని పేర్కొన్నారు. పనల మీద ధాన్యం ఉంటే ఐదు శాతం ఉప్పు ద్రావణం చల్లాలని తెలిపారు. తద్వారా ధాన్యం రంగు మారకుండా, మొలకెత్తకుండా చూసుకోవచ్చని పేర్కొన్నారు.

దత్తసాయి శివకామేశ్వరీపీఠంలో ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ దత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో సోమవారం ధర్మపరిషత్ మహా సంస్థానమ్ ఆధ్వర్యాన నీలకంఠేశ్వరస్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకులు అవ్వా హేమసుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

యూనిఫాం నాణ్యత పరిశీలన

గంపలగూడెం: జగనన్న విద్యాకానుక నాలుగో విడత పంపిణీ కోసం సరఫరా చేసిన యూనిఫాం క్లాత్‌ను మండల కమిటీ అధికారులు సోమవారం పరిశీలించారు. ఇటీవల కాంచన్ ఇండియా లిమిటెడ్ ద్వారా సరఫరా చేసిన క్లాత్‌ను స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల స్టాక్ పాయింట్లో నిల్వ చేశారు. మండల పరిధిలోని 73 పాఠశాలకు చెందిన 4,826 విద్యార్థులకు ఒక్కొక్కరికి మూడు జతల యూనిఫాంకు అవసరమైన క్లాత్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేర కాంచన్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ నుంచి మండలానికి సరఫరా చేశారు. సంబంధిత యూనిఫామ్ క్లాత్ నాణ్యతను మండల కమిటీ అధికారులైన ఎంఈఓ సోమశేఖర్ నాయక్, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం నాగరాజు, స్టాక్ పాయింట్ పాఠశాల హెచ్ఎం ఎస్ జమలయ్య పరిశీలించారు.



యూనిఫాం క్లాత్‌ని పరిశీలిస్తున్న అధికారులు

మిర్చి పంట పరిశీలన

ముసునూరు: వర్షాలు, ఈదురు గాలులకు నేల కొరిగిన మిర్చి పంటను తక్షణ సస్యరక్షణ చర్యల ద్వారా రక్షించుకోవాలని ఉద్యానశాఖ కమిషనరేట్ సహాయ సంచాలకుడు ఆర్.రామ్మోహన్ అన్నారు. ముసునూరు, వలసపల్లి గ్రామాల్లో మండల ఉద్యాన శాఖాధికారి ఆర్.హేమ ఆధ్వర్యంలో కల్లాలపై ఉన్న మిర్చి పంటను ఉన్నతాధికారుల బృందం సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని మిర్చి సాగు చేసే రైతన్నలు తడిసిన పంటను తక్షణం ఆరబెట్టాలని సూచించారు. సర్పంచ్ చలసాని దామోదర్, ఉప సర్పంచ్ సుబ్బారావు, ఉద్యాన శాఖ ఏలూరు సహాయ సంచాలకులు జె.శాంతి పాల్గొన్నారు.



మిర్చి పంటను పరిశీలిస్తున్న అధికారులు

ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మానం



ప్రతిభ చూపిన విద్యార్థులను సన్మానించిన ఎంఈఓ

పెనుగొలను(గంపలగూడెం): గంపలగూడెం మండలం పెనుగొలను జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో 500పైగా మార్కులు సాధించిన ఆరుగురు విద్యార్థులకు షిరిడి సాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం ప్రోత్సాహక నగదు పంపిణీ, సన్మానం గావించారు. పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు షేక్ సఫియాబేగం(558), రామాల రాజు (552), సంగెపు అరవింద్ (552), పి. ధరణి(521), కోరంపల్లి ఉదయని(520) పగడాల రీనా కౌశల్(506)కు షిరిడి సాయి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి విద్యార్థికి రూ. 500ను ఎంఈఓ సోమశేఖర్‌నాయక్ చేతుల మీదుగా అందజేశారు. విద్యార్థులకు సేవా సమితి సభ్యులు నారాయణ రావు శాలువా కప్పి సన్మానించారు. హెచ్ఎం డి.చంద్రం అభినందించారు.



విద్యార్థులను సత్కరించిన ఎస్ఆర్ఆర్ హైస్కూల్ హెచ్ఎం

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మానం

నూజివీడు: ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ప్రతిభను కనబరిచి 500పైబడి మార్కులను 13 మంది విద్యార్థులు సాధించారు. దీంతో హైస్కూల్ హెచ్ఎం భాగవతుల హేమలత సోమవారం విద్యార్థులను, వారి తల్లిదండ్రులను హైస్కూల్‌కు ఆహ్వానించి విద్యార్థులను ఘనంగా సన్మానించారు. అలాగే వారికి తోడ్పాటును అందించిన తల్లిదండ్రులను, విజయానికి కారకులైన ఉపాధ్యాయులను అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్‌లో కూడా చక్కగా చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు విద్యార్థుల చదువుపై శ్రద్ధ తీసుకోవాలన్నారు.